స్థానిక విశ్వాసాలను పాటించండి - స్థానిక సంస్కృతులను ప్రోత్సహించండి - దేశీయ వ్యక్తిత్వాన్ని కాపాడండి

- స్వామి వివేకానంద

“శరణుశరణు దుర్గాలమ్మలు - తుమ్మెదీరో - మీ చరణాలు తప్పలేము
మీచరణాలుతప్పినగాని - తుమ్మెదీరో - మీ కరుణాలు తప్పలేను
మీలాటి కాలమురాగ - తుమ్మెదీరో - మిమ్ము తలచి పాడుతాము
శరణుబాబు గంగుగారు - తుమ్మెదీరో - శరణుబాబు సంజీవరాజు
శరణుబాబు మాకలిశక్తి - తుమ్మెదీరో - నందపురమున వెలిసియున్నది
శరణుబాబు దేశిరాజులు - తుమ్మెదీరో - శరణుబాబు దుర్గాలమ్మలు
తప్పపాడెము తగులపాడెము - తుమ్మెదీరో - కోపచింతలొద్దుబాబు
ఓ... తెలియని నుడుగులు బాబు - తుమ్మెదీరో - మాకు తెలియని జెప్పవాలె
ఓ... మరిచిన నుడుగులు బాబు - తుమ్మెదీరో - మతియందు గొలుపవాలె” - మోదకొండమ్మపదం

దిగువప్రాంతంలోని వడ్డాదిలో మత్స్యరాజుల - మన్యప్రాంతంలోని నందపురం దేశిరాజుల మధ్య వియ్యాలుకయ్యాలను వర్ణించేది మోదకొండమ్మపదం. మోదమ్మ మొదలైన దుర్గాండ్ల ఏకైక సంతానం సంజీవరాజును, పూలగండువనంలో విహరిస్తున్న గంగుగారికిచ్చి పెండ్లి చేసి ఎగువ-దిగువ రాజ్యాలమధ్య, ఈ రాజ్యాలలోని కులాలమధ్య సామరస్యాన్ని ఈ తుమ్మెదపదం బోధిస్తున్నది.

విశాఖమన్యం పురాణ ప్రశస్తిగన్న మత్స్యరాజ్యం. ‘విరాటరాజుదేశం - ఇటుకపండుగ చేసుతాము’ అని గిరిజనులు పాడుకుంటారు. విరాటరాజు దేశంలో అజ్ఞాతవాసం చేస్తున్న పాండవులుగా తమను గిరిజనులు చిత్రించుకుంటారు. ఒకనాటి మత్స్యరాజ్యంలో ప్రాదేశిక మండలాలకు చెందిన ‘పిట్టగడ్డ జలంపల్లి - పట్టపుకోలన్న’ను నందిపండుగలో ఆహ్వానిస్తారు. ‘వళ్ళుకు వడ్డాది పసుపుకావాలి’ అని తమ ప్రాంతంలో పండేపంటల ప్రత్యేకతను చెప్పుకుంటూ ‘పంచపాండవుల పంట - దుర్యోధనుడి వంట’ అంటూ తమ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరరావడంలేదని నందిపదంలో ఆక్రోశిస్తారు.

'జోర జోర జోర – పంచపాండవులార
లోతుగడ్డనున్న – వీరభద్రుడ
లంబసింగినున్న – బాలరాకాసమ్మ
బోడకొండనున్న – శాంబరమ్మనీవు
మాదుగునున్న – మత్స్యకంబేరమ్మ
కొండకంబేరున్న – నీలకంఠుడు
పిట్టగడ్డ జలంపల్లి – పట్టపుకోలన్న

విరాటరాజు దేశం – ఇటుకపండుగలు
కాశివారిదేశం – గంగపండుగలు
కొండవారిదేశం – కొలువుపండుగలు' అని నందిపదం పాడుకుంటూ పాండవదేశం పాటపూజారులు దేవతలను పండుగ బసలోకి ఆహ్వానిస్తారు. అప్పటికి ఇప్పటికీ కొనసాగుతున్న అవే సమస్యలకు పరిష్కారం గుర్తుచేసుకుంటారు.

'అంతమైన నందపురము – నందియాటలె ఆడివద్దాం
తీయగుమ్మడి తీసివద్దాం – మళ్ళుగుమ్మడి మరలివద్దాం' అని గిరిజన మహిళలు పాడుకునే 'నందపురం' నేటి ఒరిస్సాలోనున్న జైపూరుకు ముందు రాజధాని. మాదుగుల, వడ్డాది, వజ్రగడ, గొలుగొండ ఒకనాటి వారి సామంతరాజ్యాలు, కొండ రాజ్యాల తిరుగుబాటు ధోరణులను గుర్తించిన నాటి బ్రిటిష్ ప్రభుత్వం తూర్పుకనుమల్లోని యీ కొండరాజ్యాల స్వయం ప్రత్తిపత్తిని గుర్తించి వారితో నేరుగా ఒప్పందాలు కుదుర్చుకున్నది. గొలుగొండ అనంతభూపతి పన్నుబకాయి పడడంవల్ల అని జమీందారిని స్వాధీనం చేసుకున్నది (1830). దీనికి కొండప్రాంతాల ముఠాదారులు ఎదురుతిరిగారు. పాండవరాజ్యం వస్తుందంటూ పాటపూజారులు జనాన్ని తిరుగుబాటుకు ప్రోత్సహించారు. చిన్నభూపతి, సన్యాసిభూపతి, గూడెంపాతవీధి తగ్గివీరయ్యదొర, కొత్తవీధి శోభిలందొర, మొట్టడం వీరయ్యదొర తిరుగుబాటుదారుల్లో ప్రముఖులు. గిరిజనుల నాయకత్వంలోని ఈ పితూరీ గొలుగొండ – గూడెం పితూరీగా ప్రసిద్ధి పొందింది. భద్రాచలం, రంప, రాజవొమ్మంగి ప్రాంతాల్లో 1798–1870వరకు కొనసాగినది రంపపితూరీ. లాగరాయి పితూరీలో పాల్గొన్న నేరంమీద రాజవొమ్మంగి పోలీసుస్టేషన్‌లో నిర్బంధించిన(1917) మొట్టడం వీరయ్యదొరను అప్పటికి ఐదారేళ్ళుగా మన్యంప్రజలను కూడగడుతున్న అల్లూరిసీతారామరాజు విడిపించారు. ఆయన నాయకత్వంలో 1922–24 లలో ఉద్ధృతమైన తిరుగుబాటులో ఎందరో తుపాకీతూటాలకు బలికాగా, 11మంది జీవితఖైదు, వందలాదిమంది కారాగారశిక్ష అనుభవించారు. 276గ్రామాలు ఉద్యమంలో నలిగిపోయాయి. 1935లో ఆంధ్రశ్రామిక, ధార్మికరాజ్యసభ కింద శ్రీమందేశ్వరశర్మ నాయకత్వంలో మాదుగులలో గిరిజనులు సమావేశమై గాంధేయపద్ధతిలో, 'మినుములూరి ఘాట్‌రోడ్డురావాలి', 'మిత్తికోసం గొత్తిపని పోవాలి' అని నినదిస్తూ మత్రికామయ్య, కంఠామత్స్యాలు, ఉబ్బేటిరంగారావు మొదలైనవారు పోరాటం సాగించారు.

నాటినుండి ఎంతో అభివృద్ధి సాధించినట్లు కనిపించినా, బీదప్రజలను ఆదుకునే అడవి నాశనమైంది. ఉగాలు కొట్టి కొండలు విరిగిపడుతున్నాయి. ఖనిజాలకోసం తవ్వకాలు ముమ్మరమై ఈ ప్రమాదాలు మరింత అధికమౌతున్నాయి. ప్రజలమధ్య, ప్రాంతాలమధ్య అసమానతలు పెరుగుతున్నాయి. ఒకనాడు అడవిఒడిలో సర్దుకుంటూ బ్రతికిన సమాజం, నేడు ఉన్నవారు లేనివారుగా చీలిపోతున్నది. ఆధివ్యాధులతో కృంగికృశించిపోతుంది. 'చుక్కల సురిటిపల్లి చూడగల్ల బయలు - వెన్నెల వెదురుపల్లి ఆడగల్ల బయలు' అని ఒకప్పుడు ఆటపాటలతో మారుమోగిన మన్యం పల్లెలు ఈనాడు చుక్కలు తేలితే చూసేవారు లేక, వెన్నెల తేలితే ఆడేవారులేక సంప్రదాయవేడుకలకు దూరమై బోసిపోతున్నాయి.

ఇటువంటి వెనుకబడిన ప్రాంతాలలోని దరిద్రనారాయణుల సేవకోసం మళ్ళీమళ్ళీ జన్మిస్తానని స్వామివివేకానంద బోధించారు. స్వామిజీ 150వ జయంతి ఉత్సవాలను దేశవ్యాప్తంగా జరుగుతున్న ఈ సంవత్సరంలో, మత్స్యరాజ్యంగా చరిత్ర పురాణ ప్రశస్తి పొంది - స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రముఖపాత్ర వహించిన విశాఖమన్యం అభివృద్ధికి తోడ్పాటు అందించడానికి, ఈ మన్యం విశిష్ట వారసత్వం ముందు తరాలకు అందించడానికి అందరం సంసిద్ధం కావాలి.